మార్కెట్ సొసైటీని ఆదర్శంగా తీసుకోవాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 19 : కరీంనగర్ జిల్లా మూల్కనూర్ మార్కెట్ సొసైటీ రైతులకు చేరువలో ఉండి ఉత్తమ సొసైటీగా పేరు తెచ్చుకుందని అచ్చంపేట మార్కెట్ పాలకమండలి కూడా రాష్ట్రంలో పేరు తెచ్చుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన నూతన చైర్మన్, పాలకమండలి పదవీ ప్రమాణస్వీకరోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. త్వరలోనే రైతులకు అన్ని పంటలకు బీమాను వర్తింపజేస్తామని తెలిపారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతటి రజిత, వైస్ చైర్మన్ వెంకటయ్య, పాలక మండలి సభ్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ సంతోష్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

వెల్దండ, సెప్టెంబర్ 19 : గురుకులంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షపు నీటి నిల్వ, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరా తీసి పలు రికార్డులను పరిశీలించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ కార్తీక్‌కుమార్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, అర్హులైన మైనార్టీ సంస్థలు వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన తీర్చిదిద్దే సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి గోపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శికులు వివిధ రంగాలైన ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, వెటర్నరీ, డైరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్, టూరిజం, హాస్పిటాలిటీ, డ్రైవింగ్, ఎలక్ట్రానిక్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్‌పై వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కోసం గుర్తింపు పొందిన సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వృత్తి శిక్షణ సంస్థలు జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ(NSDC/,TASK) W/WUGUG, మెప్మాతో గుర్తింపు అనుసంధానమై ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వృత్తి శిక్షణ సంస్థలు తమ దర ఖాస్తులను నాగర్‌కర్నూల్ జిల్లా కార్యాలయాల సముదాయంలోని మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

తాసీల్దార్‌గా శ్రీకాంత్

బల్మూరు, సెప్టెంబర్ 19 : బల్మూరు తాసీల్దార్‌గా శ్రీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శైలేంద్రకుమార్ బదిలీపై అచ్చంపేటకు వెళ్లారు. నూతన తాసీల్దార్‌గా శ్రీకాంత్ కొల్లాపూర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరందిస్తాం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి

డీ82 కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెల్దండ, సెప్టెంబర్ 19 : కేఎల్ఐ డీ82 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండలం గుండాల వద్ద డీ82 కాల్వను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ గుండా అక్కడక్కడ ఉన్న చిన్నచిన్న మరమ్మతులను చేయించి త్వరలో చివరి ఆయకట్టుకు సాగు నీరందిస్తామన్నారు. కల్వకుర్తిని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్వత్‌రెడ్డి, భూపతి రెడ్డి, సంజీవ్‌కుమార్, జయప్రకాశ్, మోతీలాల్, శ్రీను యాదవ్ అధికారులు ఉన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన

అమ్రాబాద్, సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీ పరిధిలోని ఓటర్ జాబితాపై గురువారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని, అదేవిధంగా ఓటర్ జాబితాపై అభ్యంతారాలను లిఖిత పూర్వకంగా స్వీకరించి సరిచేయబడునని ఎంపీడీవో తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు వచ్చే అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈనెల 28వ తేదీన గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా తుది జాబితాను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో కరుణనాయక్, ఆయా పార్టీల నాయకులు హరినారాయణ గౌడ్, రాజారాం గౌడ్, నాగరాజు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

అమ్రాబాద్ : ఓటర్ జాబితాపై వివరిస్తున్న ఎంపీడీవో వెంకటయ్య

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 19 : ఓటర్ల జాబితా ముసాయిదాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 21వ తేదీలోగా తెలియజేసి అధికారులకు సహకరించాలని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు కోరారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులకు మండల ఓటర్ల జాబితాను అందించి వారితో చర్చించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులు, చేర్చడాలు ఉన్నట్లయితే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సునీత, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

చారకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్

చారకొండలో..

చారకొండ, సెప్టెంబర్ 19 : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వివిధ గ్రామాల్లో వార్డుల వారీగా రూపొందించిన ఓటరు జాబితాపై ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే ఈనెల 21వ తేదీ వరకు సవరణకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు వెంకటయ్యగౌడ్, బాలస్వామి, ఆశోక్, శ్రీను, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి గణేశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

రంగాపూర్‌లో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 19 : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్ శివారులోని అటవీశాఖ నర్సరీ సమీపంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అదేవిధంగా మండలంలోని పెద్దతండా, వంకమూతితండా, ఎద్దుమిట్టతండా, కాన్యతండా, సింగారం, చిన్యాతండాల్లో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు వివిధ రకాల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశామని సీఎఫ్ చరణ్ యాదవ్, ట్రైనర్ రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ రవినాయక్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు కార్మికుల హక్కు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19 : సంక్షేమ బోర్డు అనేది కార్మికుల హక్కు అని, ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుమతించ ఇవ్వడాన్ని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాముడు డిమాండ్ చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను అమలు చేసే ప్రక్రియలో భాగంగానే సంక్షేమ బోర్డులో ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రవేశం కల్పిస్తున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించడాన్ని వారు తప్పుపట్టారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులంతా సెప్టెంబర్ 23వ తేదీన హైదరాబాద్‌లో జరిగే కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి అశోక్, పట్టణ అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి సత్యం, ప్రచార కార్యదర్శి శ్రీను, మన్యం, పాండు, వెంకటయ్య, యాదయ్య, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

- బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు యాదగిరి

వెల్దండ పోలీసుల ఆదుపులో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, సెప్టెంబర్ 19 : ప్రభుత్వ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు యాదగిరి అన్నారు. గురువారం రాజ్ భవన్ ముట్టడి నేపథ్యంలో వెల్దండ మండలంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, శేఖర్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ రుణమాఫీ చేయకుండా అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కుమారస్వామి, నవీన్ ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 19: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకుడు నాగరాజు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల సంక్షేమంకోసం బీఆర్ఎస్ నాయకులు పోరాడుతామన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కల్వకుర్తిరూరల్ : పోషకాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్

లింగాల/కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 19 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం లోపంతోనే శిశు, మాతా మరణాలు జరుగుతున్నాయని వాటిని నివారించడానికే పోషణ్ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ పాండునాయక్ అన్నారు. గురువారం సీడీపీవో దమయంతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పాలు, పండ్లు, ఆకుకూరలతో కూడిన నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చదువు నేర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు, సీడీపీవోలను ఘనంగా సన్మానించారు. ప్రతిఒక్కరూ నిత్యం పోషకాహారం తీసుకోవడంతోనే రోగాల భారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతామని కల్వకుర్తి ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి సూచించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని వడ్డెరబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రోజు మంచి పోషకాలు ఉన్న పండ్లను, పండ్ల రసాలను తీసుకోవడం చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం రామస్వామి, ఆర్ఐ అనిల్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, పోషణ్ అభియాన్ మండల కోఆర్డినేటర్ పార్వతి, హెల్త్ సూపర్ వైజర్ శాంత, అంగన్‌వాడీ టీచర్లు గీతా, సంధ్యారాణి, మంజుల, జయమ్మ, నారాయణమ్మ, మాధవి, ఆయాలు, ఆశలు ఉన్నారు.

అస్తవ్యస్తంగా గురుకుల విద్యావ్యవస్థ

- కాంగ్రెస్ ప్రభుత్వంలో గోస పడుతున్న విద్యార్థులు
- బీఆర్ఎస్ మండల నాయకుడు ఎర్ర నాసర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర నాసర్

అమ్రాబాద్, సెప్టెంబర్ 19 : నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో గురుకుల విద్యావ్యవస్థ ఉన్నత శిఖరాలను అందుకున్నదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో గురుకుల విద్యావ్యవస్థ అడుగంటిపోతుందని బీఆర్ఎస్ మండల నాయకుడు ఎర్రనాసర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల విద్యాలయాల్లో ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారని బీఆర్ఎస్ హయంలో గురుకులాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించందని ఆయన గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాల్లో విద్యార్థులు గోస పెడుతున్నారని తరచూ ఆత్మహత్యలు, ఫుడ్‌పాయిజన్, పురుగుల అన్నం, కనీస వసతులు లేక విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. గురుకులాలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గురుకులాలలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు విద్యతోపాటు అన్ని వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివ, శ్యాం, నరేశ్, అనంతరాములు, తిరుపతి పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు బ్యాంకు రుణాలు బంద్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 19 : మండలంలోని అన్ని గ్రామాల్లో అసైన్డ్, గైరాన్ భూములకు బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో తిరిగి రుణాలు తీసుకునేందుకు రైతులు బ్యాంకుల వద్దకు వెళ్తే మీ భూములకు రుణాలు ఇవ్వడం లేదని, బ్యాంక్ లాగిన్‌లో మీ భూములు కనిపించడం లేదని, రుణాలు మంజూరు చేయడం కుదరదని చెప్పడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 19 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని, ప్రతిఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుదర్, ఉపాధ్యాయులు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19 : జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని బోధన సిబ్బంది ఖాళీల భర్తీకోసం చర్యలు తీసుకుంటున్నట్లు డీఈవో గోవిందరాజులు గురువారం ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం పరీక్షలు రాసి మెరిట్ జాబితాలో నుంచి 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక కాబడిన అభ్యర్థుల మెరిట్ జాబితాను https://deonagarkurnool.weebly.com వెబ్‌సైట్ ద్వారా గురువారం విడుదల చేశామని పేర్కొన్నారు.

అభ్యర్థులు ఈనెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి

- కల్వకుర్తి సీఐ నాగార్జున

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న సీఐ

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 19 : ముస్లిం మత గురువు మహమ్మద్ ప్రవక్త సూచించిన సన్మార్గంలో ముస్లింలు నడవాలని కల్వకుర్తి సీఐ నాగార్జున కోరారు. గురువారం కల్వకుర్తి పట్టణంలో భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్‌డిపో సమీపంలోని మజీద్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం లయన్స్ క్లబ్ అల్వీ జాన్ మజీద్ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు రక్తదాన శిబిరానికి సీఐ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత, ఖురాన్, బైబిల్ మత గ్రంథాల సారం ఒక్కటేనని ప్రతి ఒక్కరూ విద్వేషాలను వీడి సమాజంలో శాంతి యుతంగా జీవించడమే గ్రంథాల సారాంశమన్నారు. అనంతరం రక్తదానం చేసిన 58 మందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్ తాహెర్‌అలీ, నిర్వాహకులు ఉన్నారు.

క్రైస్తవులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలి

అచ్చంపేట, సెప్టెంబర్ 19 : రాజకీయ పార్టీలు క్రైస్తవులను కేవలం ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా వాడుకోని వదిలేస్తున్నారని యూనైటెడ్ ఇండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. గురువారం అచ్చంపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలో దాదాపు 45 వేల మంది క్రైస్తవులు జనాభా ఉంటుందన్నారు. అచ్చంపేట పట్టణంలో క్రైస్తవులకు కమ్యూనిటీహాల్ నిర్మాణం, శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పోస్టులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం అచ్చంపేట ఐపీసీ చర్చి పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్‌సుందర్‌రావు మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలోని క్రైస్తవుల సంక్షేమాన్ని రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో జేఏసీ అచ్చంపేట చైర్మన్ జాన్‌పాల్, వైస్ ప్రెసిడెంట్ బయన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న క్రిస్టియన్ నేతలు

మృతుడి కుటుంబానికి ప్రమాద బీమా అందజేత

బీమా డబ్బులు అందజేస్తున్న ఎస్పీఎం

లింగాల, సెప్టెంబర్ 19 : మృతుడి కుటుంబానికి ప్రమాద బీమాను అందజేసినట్లు వనపర్తి బ్రాంచ్ ఎస్పీఎం మాచర్ల తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మాకం సలేశ్వరం ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా మృతుడి కుమారుడు (నామిని) ఉపేంద్రకు గురువారం రూ.3,12,100 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీఎం మాచర్ల మాట్లాడుతూ మండలంలోని వల్లభాపుల్ బ్రాంచ్ కార్యాలయంలో రూ.3 లక్షల ప్రమాద బీమా చేయించుకున్నాడు. దీంతో ప్రమాద బీమా చేసుకున్న ఐదు నెలలలోపే ప్రమాదవశాత్తు మరణించడంతో మృతుడి కుమారుడు ఉపేంద్రకు చెక్కును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో బీపీఎం బాలాజీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత

తిమ్మాజీపేట, సెప్టెంబర్ 19 : తల్లిని కంటికిరెప్పల చూసుకుంటున్న కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తల్లికి గ్రామస్తులు చేయూతను అందించారు. తిమ్మాజిపేట మండలం మారేపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ప్రవీణ్‌కుమార్ (16) తల్లి బంగారమ్మతో కలిసి పూరిగుడిసెలు ఉంటున్నాడు. నిరుపేదలు కావడంతో చిన్నచిన్న పనులు చేస్తూ ప్రవీణ్‌కుమార్ తన తల్లిని పోషించుకుంటూ వస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి అకస్మాత్తుగా ప్రవీణ్‌కు ఫీట్స్ రావడంతో దవాఖానకు తరలించేలోపే మృతి చెందాడు. దీంతో మృతుడి తల్లి దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. గురువారం ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు ఆమెను ఆదుకోవాలని నిర్ణయించి బంధువుల సహాయంతో మృతుని అంత్యక్రియలు జరిపించారు. అనంతరం గ్రామస్తులందరూ కలిసి ఆమెకు రూ.35వేలు అందజేసినట్లు గ్రామ పెద్ద కూకుట్ల మల్లేశ్ తెలిపారు.

అర్థిక సాయం చేసిన వారిలో మాజీ సర్పంచ్ పరందాములు గౌడ్ విండో డైరెక్టర్ శ్రీరాం, వెంకటస్వామి, రమేశ్, రాఘవాచారీ, గ్రామస్తులు ఉన్నారు.